ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

అనకాపల్లి

జిల్లా వార్తలు

శనివారం 6 ఏప్రిల్ 2024



కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

- గొల్లలపాలెంలో 13 మంది..
- రోలుగుంట మండలంలో 18 మంది..

సబ్బవరం, ఏప్రిల్ 5: జిల్లాలో గ్రామ వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. సబ్బవరం మండలం గొల్లలపాలేనికి చెందిన 13 మంది వలంటీర్లు శుక్రవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారని ఎంపీడీవో ఎస్.రామ్మోహన్ రావు తెలిపారు. వారి రాజీనామాలను ... మిగతా 8వ పేజీలో

అంగన్‌వాడీల ఆశలు వమ్ము

పాదయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేర్చని జగన్

తెలంగాణ కంటే ఎక్కువ వేతనం ఇస్తామన్న వైసీపీ అధినేత



అనకాపల్లిలోని శిబిరంలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు(ఫైల్ ఫోటో)

- గడిచిన ఐదేళ్లలో ఒకే ఒక్కసారి వేయి రూపాయలు పెంచిన ప్రభుత్వం
- ప్రస్తుతం తెలంగాణలో అంగన్‌వాడీ కార్యకర్తకు రూ.13,500, ఆయాకు రూ.9,000
- ఇక్కడ రూ.11,500, ఆయాకు రూ.7,000 మాత్రమే...
- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, మినీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మార్పు వంటి డిమాండ్లపైనా దాటవేత
- 42 రోజులపాటు నిరవధిక సమ్మె చేసిన సిబ్బంది
- సమ్మె కాలానికి జీతం చెల్లించని వైనం

విశాఖపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):

గత ఎన్నికల ముందు అంగన్‌వాడీ సిబ్బందికి ఇచ్చిన హామీలను వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మరిచిపోయారు. ముఖ్యంగా తెలంగాణలోని అంగన్‌వాడీ సిబ్బంది కంటే ఎక్కువ వేతనాన్ని చెల్లిస్తామని, ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తామని పాదయాత్ర సమయంలో ఊరూరా హామీ ఇచ్చారు. అయితే, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని విస్మరించారు. ఒకే ఒక్కసారి మాత్రం వేయి రూపాయల వేతనాన్ని పెంచారు. అయితే తెలంగాణలో కంటే ఎక్కువ ఇస్తామన్న హామీని మాత్రం నెరవేర్చలేకపోయారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలంటూ నిరవధిక సమ్మె చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని అంగన్‌వాడీ సిబ్బంది వాపోతున్నారు. జగన్ సర్కారు అంగన్‌వాడీ సిబ్బందికి తీరని అన్యాయం చేసిందని, ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమను గుర్తించకపోవడం దారుణమని ఆగ్రహాన్ని వ్యక్తంచేస్తున్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేసిన కాలానికి వేతనాలు చెల్లిస్తామని చెప్పిన హామీని కూడా ఇప్పటివరకూ ఈ ప్రభుత్వం అమలు చేయలేదని నగర పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త ఆవేదన వ్యక్తం చేసింది.

ఎన్నికల వేళ ఇచ్చిన హామీ

గత సార్వత్రిక ఎన్నికలకు ముందు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేసిన జగన్మోహన్‌రెడ్డి...అన్ని వర్గాలకు మాదిరిగానే అంగన్‌వాడీ సిబ్బందికి కూడా



పలు హామీలు ఇచ్చారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న అంగన్‌వాడీ సిబ్బందికి అండగా ఉంటానని, పెండింగ్ సమస్యలను పరిష్కరించడంతో పాటు తెలంగాణలో కంటే వేయి రూపాయలు వేతనం అదనంగా చెల్లిస్తానని హామీ ఇచ్చారు. అయితే, అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను అమలు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం చూపారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు అంగన్‌వాడీ కార్యకర్తలకు ... మిగతా 8వ పేజీలో

ఇచ్చిన హామీలను జగన్ అమలు చేయలేదు

- వై.తులసి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షురాలు



అంగన్‌వాడీ సిబ్బందికి జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయలేదు. వేతనం తెలంగాణలో కంటే వేయి రూపాయలు అదనంగా ఇస్తామన్నారు. అడిగినా ప్రభుత్వం స్పందించలేదు. ఇతర సమస్యలను పట్టించుకోలేదు. అందుకే నిరవధిక సమ్మెకు దిగాం. సమ్మె చేస్తున్న తమతో చర్చలు జరిపిన ప్రభుత్వ పెద్దలు...అప్పుడు ఇచ్చిన హామీలను ఇప్పటివరకూ అమలు చేయలేదు. సమ్మె కాలానికి జీతం చెల్లించలేదు. ఇతర హామీలకు సంబంధించిన జీవోలు విడుదల చేయలేదు. అంగన్‌వాడీలకు న్యాయం చేయాలి.

మహిళా ఓటర్లే కీలకం

అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వారే అధికం



- పురుషుల కంటే 35,584 మంది ఎక్కువ
- అభ్యర్థుల విజయాన్ని శాసించేది వారే..
- అతివల ఓట్ల కోసం పార్టీల వ్యూహరచన

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములకు మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ అన్ని నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. అభ్యర్థుల విజయాన్ని వీరే శాసించనున్నారు. అందుకే ప్రధాన పార్టీల అభ్యర్థులు మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 35,584 మంది ఎక్కువగా ఉన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే విజయంపై ప్రభావం చూపగలరని అన్ని పార్టీల అభ్యర్థులు నమ్ముతున్నారు.

ఈ నేపథ్యంలో వారి ఓటర్లను రాబట్టేందుకు వ్యూహరచన చేస్తున్నారు. ఇప్పటికే అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్, వైసీపీ ఎంపీ అభ్యర్థిగా మంత్రి బూడి ముత్యాలునాయుడు పేర్లు ఖరారు కావడంతో క్షేత్రస్థాయిలో ప్రచారం జోరందుకుంది. ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అనకాపల్లి, నర్సీపట్నం, పాయకరావుపేట, ఎలమంచిలి, చోడవరం, మాడుగుల, పెందుర్తి అసెంబ్లీ నియోజవర్గాలు ఉండగా, మొత్తం 15,72,430 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 7,68,423 మంది, మహిళా ఓటర్లు 8,04,007 మంది ఉన్నారు. 43 మంది ఇతరులు ఉన్నారు. పురుషులు కన్నా మహిళలు 35,584 ఎక్కువగా ఉండడంతో ఆయా పార్టీల అభ్యర్థులకు మహిళా ఓట్లు కీలకం కానున్నాయి. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో పురుషుల కన్నా 7,404 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉండగా, నర్సీపట్నంలో 6,424, చోడవరం 6,111, ఎలమంచిలి 5,384, మాడుగుల 4,630, పాయకరావుపేట 3,684, పెందుర్తి నియోజకవర్గంలో 1,947 మంది ఎక్కువగా ఉన్నారు.

మహిళా ఓటర్లను ఆకర్షించేలా ప్రచారానికి సన్నాహాలు

అనకాపల్లి పార్లమెంటరీ పరిధిలో దాదాపు అన్ని నియోజకవర్గాలు గ్రామీణ నేపథ్యం ఉన్నవే. దీంతో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల సమాచారాన్ని సేకరిస్తున్నారు. మహిళా సంఘాల ప్రతినిధులతో పాటు అచ్యుతాపురం సెజ్‌లో పని చేసే మహిళా ఓటర్లను తమకు అనుకూలంగా ఓటు వేసేలా ఆయా రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. దీని కోసం ఇప్పటికే మహిళా సంఘాల ప్రతినిధులను కలిసి మద్దతు కూడగట్టుకొనే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మహిళా ఓటర్లను ఆకర్షించేలా ప్రచారం నిర్వహించేందుకు సాధ్యమైనంత వరకు అటు కూటమి అభ్యర్థితో పాటు ఇటు వైసీపీ అభ్యర్థి కూడా పార్టీలో మహిళా కార్యకర్తలను ముందుంచి ఎన్నికల ప్రచారం చేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే కూటమి అభ్యర్థి సీఎం రమేశ్ సతీమణి సీఎం శ్రీదేవి అనకాపల్లి పట్టణంలో పలు వీధుల్లో మహిళా మోర్చా, తెలుగు మహిళ, జనసేన వీరమహిళలను కలుపుకొని ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. ఆమె ఆధ్వర్యంలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అన్ని నియోజకవర్గాల్లో మహిళలు సీఎం రమేశ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేసేందుకు సన్నద్ధమవుతున్నట్టు సమాచారం.

అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పురుష, మహిళా ఓటర్ల మధ్య వ్యత్యాసం ఇలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	వ్యత్యాసం
అనకాపల్లి	1,01,744	1,09,148	7,404
చోడవరం	1,04,450	1,10,561	6,111
మాడుగుల	91,291	95,921	4,630
పెందుర్తి	1,48,555	1,50,502	1,947
ఎలమంచిలి	99,340	1,04,724	5,384
పాయకరావుపేట	1,21,911	1,25,595	3,684
నర్సీపట్నం	1,01,132	1,07,556	6,424
మొత్తం	7,68,423	8,04,007	35,584


జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో దయానిధి, సాంఘిక సంక్షేమశాఖ ఏడీ అజయ్‌బాబు పాల్గొన్నారు. - అనకాపల్లి కలెక్టరేట్

వైభవంగా నూకాంబిక అమ్మవారి ఊరేగింపు



రథాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఊరేగింపు శుక్రవారం సాయంత్రం వైభవంగా జరిగింది. మహిళా భక్తులు ఘటాలను శిరస్సుపై పెట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. - వార్త 7వ పేజీలో..



ఉత్సవమూర్తి

రారెత్తిస్తున్న ఎండలు

అనకాపల్లిలో గరిష్ఠ ఉష్ణోగ్రత 38°



అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 5: ఎండలు మండిపోతున్నాయి. శుక్రవారం అత్యధిక ఉష్ణోగ్రత 38.0 డిగ్రీలు కాగా అత్యల్ప ఉష్ణోగ్రత 25.0 డిగ్రీలుగా నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. ఉదయం పదిన్నర గంటల నుంచే వడగాడ్పులు ప్రారంభం కావడంతో పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. ఈ వేసవి ఆరంభంలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత. గత నాలుగు రోజుల నుంచి 35 డిగ్రీల నుంచి 37 డిగ్రీల వరకు ఉన్న ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా శుక్రవా రం 38 డిగ్రీలకు పెరగడంతో పాటు వడగాడ్పులు కూడా వీయడంతో నిత్యం జనాలతో రద్దీగా ఉండే పలు ప్రధాన రహదారులు బోసిపోయాయి. మహిళలు, వృద్ధులు తలపై చీర చెంగులు, తువ్వాళ్లను వేసుకుని రాకపోకలు సాగించారు. ద్విచక్ర వాహనచోదకులు వాహనాలు నడపడానికి కూడా ఇబ్బంది పడ్డారు. మెయిన్‌రోడ్డు, చోడవరం రోడ్డు, శారదానది రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డుతో పాటు చిన్నపాటి వీధులు కూడా మధ్యాహ్నం వేళ ఖాళీగా దర్శనమిచ్చాయి. వడగాడ్పులు, ఉష్ణోగ్రతలు కారణంగా జనం శీతలపానీయాల దుకాణాలను ఆశ్రయిస్తు న్నారు. పలుచోట్ల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు.



జనసందడి లేని అనకాపల్లి మెయిన్‌రోడ్డు



అనకాపల్లి మెయిన్‌రోడ్డులో తలపై చెంగు వేసుకుని వెళుతున్న మహిళలు

7, 8 తేదీల్లో పవన్ కల్యాణ్ జిల్లా పర్యటన

- అనకాపల్లి, ఎలమంచిలిలో వారాహి విజయ భేరి సభలు



అనకాపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వారాహి విజయ భేరి యాత్రలో భాగంగా జిల్లాలో ఈ నెల 7, 8 తేదీల్లో పర్యటించనున్నారు. తొలుత ఈ నెల 5న అనకాపల్లి వస్తారని ముందుగా ప్రకటించినా పవన్‌కు అనారోగ్యం కారణంగా ఆయన ఆస్పత్రిలో చేరడంతో పర్యటన వాయిదా పడిన సంగతి తెలిసిందే. పవన్ కోలుకోవడంతో ఈ నెల 7న అనకాపల్లిలో జరిగే వారాహి విజయభేరి బహిరంగ సభకు, అదేవిధంగా ఈ నెల 8న ఎలమంచిలిలో జరిగే బహిరంగ సభకు హాజరు కానున్నారు. ఆయన రెండు రోజుల జిల్లా పర్యటన నేపథ్యంలో అనకాపల్లి జిల్లా జనసేన అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, అనకాపల్లి కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణ, ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ ఏర్పాట్లు చేస్తున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శని)	6.15
సహరి (ఆది)	4.31

పాఠశాలల్లో గుడ్డు బంద్



- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వారానికి ఐదు రోజులు గుడ్డు
- ఎప్పటినుంచో సరఫరా
- నాలుగు నెలల నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో ఒకటో తేదీ నుంచి నిలిపివేసిన కాంట్రాక్టర్లు
- ప్రభుత్వ తీరుపై తల్లిదండ్రులు రుసరుస
- చిక్కీల సరఫరాదారుడికి భారీగా బకాయిలు

విశాఖపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి గుడ్ల సరఫరా నిలిచిపోయింది. ప్రభుత్వం నాలుగు నెలలుగా డబ్బులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ సరఫరాను ఆపేశారు.



విశాఖపట్నం జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్ కలిపి 583 పాఠశాలల్లో 79,627 మంది విద్యార్థులు ఉన్నారు. అదేవిధంగా అనకాపల్లి జిల్లాలో 1,424 పాఠశాలల్లో 1,07,066 మంది విద్యార్థులు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,600 పాఠశాలల్లో 98 వేల మంది చదువుకుంటున్నారు. ప్రతి విద్యార్థికి వారానికి ఐదు రోజులు (శని, ఆదివారం తప్ప) మధ్యాహ్నం భోజనంలో ఉడకబెట్టిన గుడ్డు అందిస్తున్నారు. గుడ్ల సరఫరా కోసం జిల్లా స్థాయిలో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లను ఖరారుచేశారు. నెలలో జాతీయ గుడ్ల సమాఖ్య (నెక్) నిర్ణయించిన రేటు సగటు ధరకు గుడ్లు సరఫరా చేయాలి. దానిపై గుడ్డుకు 70-95 పైసలు రవాణా ఖర్చు కింద చెల్లిస్తారు. టెండరు నిబంధనల మేరకు వారానికి ఒకరోజు పాఠశాలకు సరఫరా చేస్తుంటారు. సరఫరాదారులు ప్రతి నెలా బిల్లును డీఈవో కార్యాలయానికి అందజేస్తుంటారు. వాటిని పరిశీలించి మధ్యాహ్న భోజన పథకం బిల్లులు మంజూరుచేసే గ్రీన్‌ఛానల్ ద్వారా అప్‌లోడ్ చేస్తే ఒకటి లేదా రెండు నెలల వ్యవధిలో సొమ్ములు అవుతుంటాయి. అయితే నాలుగు నెలలకుపైబడి బిల్లులు అందకపోవడంతో సరఫరాదారులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులు భరోసా ఇచ్చినా ఇప్పటివరకూ విడుదల కాలేదు. దీంతో గుడ్ల సరఫరా నిలిపివేయాలని సరఫరాదారులు నిర్ణయించారు. దాదాపు రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో గుడ్ల సరఫరా ఆపేశారు. జిల్లాలో ఈనెల ఒకటో తేదీ నుంచి గుడ్ల సరఫరా నిలిపివేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే గుడ్ల సరఫరా కావడం లేదని టీచర్లు చెబుతున్నారు. కాగా, వారానికి మూడు రోజులు చిక్కీలు ఇస్తుంటారు. వాటి సరఫరాదారుడికి కూడా బిల్లులు చెల్లించడం లేదు. అయితే చిక్కీలు తయారుచేసే కాంట్రాక్టర్ ప్రస్తుతం తన వద్ద సరకు ఉన్నంత మేరకు పాఠశాలలకు సరఫరా చేసి తరువాత పంపిణీకి స్వస్తి చెప్పాలని నిర్ణయించారు. పాఠశాలల్లో గుడ్ల సరఫరా నిలిపివేయడం పట్ల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పిల్లలకు ఇచ్చే గుడ్లకు ప్రభుత్వం వద్ద పైసలు లేవా అంటూ అసంతృప్తి వ్యక్తంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా గుడ్ల సరఫరాదారులకు రూ.150 కోట్ల వరకు బకాయి ఉన్నట్టు తెలిసింది.

క్రైం... crime news

ఏపీఎస్‌పీ 16వ బెటాలియన్ కానిస్టేబుల్‌పై కేసు

పెళ్లి చేసుకుంటానని వితంతువుతో మూడేళ్లుగా సహజీవనం

మాటమార్చడంతో బాధితురాలు ఆత్మహత్యాయత్నం

కృష్ణాదేవిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



కానిస్టేబుల్ బాలరాజు

గొలుగొండ, ఏప్రిల్ 5 : పెళ్లి చేసుకుంటానని ఓ వితంతువును నమ్మించి, కొంతకాలం సహజీవనం చేసిన అనంతరం నిరాకరించిన ఏపీఎస్‌పీ 16వ బెటాలియన్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసినట్టు గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ఎస్‌ఐ ఉపేంద్ర శుక్రవారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. గొలుగొండ మండలం ఏఎల్ పురానికి చెందిన వితంతువును అదే గ్రామానికి చెందిన ఏపీఎస్‌పీ 16వ బెటాలియన్ (విశాఖపట్నం)లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అడ్డబోయిన బాలరాజు పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. మూడేళ్లుగా ఆమెతో సహజీవనం చేస్తున్నాడు. తీరా పెళ్లి ప్రస్తావన తెచ్చేసరికి సదరు కానిస్టేబుల్ నిరాకరించాడు. దీంతో ఆమె మనస్తాపానికి గురై రెండు రోజుల క్రితం ఆత్మహత్యకు యత్నించిందని ఎస్‌ఐ చెప్పారు బాధితురాలు ప్రస్తుతం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతుందన్నారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

45 పశువులను పట్టుకున్న పోలీసులు

» అదుపులో ఇద్దరు డ్రైవర్లు



పశువులను అక్రమంగా తరలిస్తున్న కంటైనర్‌ను పట్టుకున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 5: మండలంలోని సీతారాంపురం జంక్షన్ వద్ద గురువారం రాత్రి కంటైనర్, బొలేరో వాహనాలలో అక్రమంగా తరలిస్తున్న 45 పశువులను పట్టుకున్నట్టు ఎస్‌ఐ జోగారావు తెలిపారు. ఈ సందర్భంగా డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. ఎస్‌ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. ముందుగా అందిన సమాచారం మేరకు సీతారాంపురం జంక్షన్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో నక్కపల్లి నుంచి తుని వైపు వెళుతున్న కంటైనర్‌లో 37 పశువులు, బొలేరో వాహనంలో 8 పశువులను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. పశువులను వెంకిపాలెంలోని గో సంరక్షణ కేంద్రానికి తరలించినట్టు ఎస్‌ఐ జోగారావు తెలిపారు. పశువుల యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలియజేశారు.

లింగంపేట డీలర్‌పై 6ఎ కేసు నమోదు

గొలుగొండ, ఏప్రిల్ 5 : మండలంలోని లింగంపేటలో గల 22వ రేషన్ డిపో డీలర్ స్వామినాయుడుపై 6ఎ కేసు నమోదు చేసినట్టు పౌర సరఫరాల శాఖ డీటీ చందనరేఖ తెలిపారు. గ్రామంలోని సదరు రేషన్ డిపో నుంచి బియ్యాన్ని అక్రమంగా నర్సీపట్నం తరలించేందుకు సిద్ధం చేయగా, గురువారం రాత్రి పోలీసులు పట్టుకున్నారన్నారు. శుక్రవారం గ్రామంలో ఈ ఘటనపై విచారణ జరిపారు. ఆటోలో 750 కిలోల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్టుగా గుర్తించినట్టు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి డీలర్‌పై 6ఎ కేసు నమోదు చేసి, ఆటోను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్టు చెప్పారు. ఆయన వెంట ఆర్‌ఐ నాగరాజు, సర్పంచ్ తోకల సంతోష్‌కుమార్ ఉన్నారు.

21 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

చోడవరం, ఏప్రిల్ 5 : పట్టణంలోని కోటవీధికి చెందిన నౌడు వెంకటరావు అనే వ్యక్తి వద్ద 21 లీటర్ల నాటుసారాను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్టు సీఐ బి.శ్రీనివాసరావు, ఎస్‌ఐ డి.శేఖరం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఈ దాడి చేసినట్టు చెప్పారు. అనంతరం నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

బైక్ బోల్తా పడి యువకుడి దుర్మరణం

విశాఖపట్నం, ఏప్రిల్ 5: బీచ్ రోడ్ తొట్లకొండ రహదారిలో శుక్రవారం సాయంత్రం బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం సిరిపురం గ్రామానికి చెందిన అజుమూరి మహేశ్వరరావు (29) నగరం నుంచి భీమిలి వైపు బైక్‌పై వస్తుండగా తొట్లకొండ వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితి లోకి వెళ్లిపోయాడు. అదే సమయంలో అటువైపుగా వస్తున్న విశాఖ నార్త్ ఏసీపీ బి. సునీల్ తన వాహనాన్ని నిలిపి తీవ్ర గాయాలతో ఉన్న మహేశ్వరరావును రుషికొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సీఐ రమేష్ చెప్పారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

విశాఖపట్నం, ఏప్రిల్ 5 : తునివలస-చిన్నాపురం రోడ్డులో రెండు బైకులు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. పద్మనాభం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. విశాఖకు చెందిన శంకరరావు, వెంకటలక్ష్మి దంపతులు బైక్‌పై విజయనగరం జిల్లా గజపతినగరంలో తమ బంధువులు మృతి చెందడంతో చూడడానికి వెళ్తుండగా చిన్నాపురం జంక్షన్ ముందు వెనుక నుంచి వస్తున్న స్కూటీ బైక్‌ను ఢీకొనడంతో వారు ఎదురుగా ఉన్న కారును ఢీకొన్నారు. దీంతో వెంకటలక్ష్మి తలకు తీవ్ర గాయాలు కాగా, ఆమె కుమారుడు మోక్షిత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంకటలక్ష్మి గర్భిణి కావడంతో మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో విజయనగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 5: స్థానిక పూల్‌బాగ్‌రోడ్డులోని శుక్రవారం కొత్తపల్లి బుచ్చియ్యపేట గ్రామానికి చెందిన తిర్రి వెంకటగణేష్ నుంచి పది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ బి. రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసి స్వగ్రామానికి తీసుకువెళ్తుండగా పూల్‌బాగ్ రోడ్డులో అనుమానం వచ్చి తనిఖీ చేయగా పది మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయని, ఈ మేరకు కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

పద్మనాభంలో 16 మద్యం సీసాలు...

విశాఖపట్నం, ఏప్రిల్ 5: అక్రమంగా 16 మద్యం సీసాలు కలిగి ఉన్న ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్టు పద్మనాభం పోలీసులు చెప్పారు. మద్ది జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా రెడ్డిపల్లి నుంచి అన్నంరాజుపేట వెళ్తున్న వై. అప్పలరాజు వద్ద 10 సీసాలు లభ్యమయ్యాయి.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

గ్రామాల్లో దుర్గంధం..

» అటకెక్కిన స్వచ్ఛ సంకల్పం

» డంపింగ్ యార్డులను తలపిస్తున్న గ్రామాలు

» చెరువులు, రహదారుల పక్కన వ్యర్థాల డంప్



వంగలి వద్ద చెరువులో డంప్ చేసి వ్యర్థాలు

సబ్బవరం, ఏప్రిల్ 5: మండలంలోని పలు గ్రామాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలు కనిపిస్తున్నాయి. వీధులు చివరన, సాగు నీటి కాలువలు, చెరువులు, రహదారుల పక్కన ఎక్కువ శాతం వ్యర్థాలు డంప్ చేస్తుండడంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహన చోదకులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొన్ని గ్రామాల్లో వ్యర్థాలకు నిప్పు పెట్టేస్తుండడంతో ఆ ప్రాంతాలు పొగలు కమ్ముకోవడంతో ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు.



చోడవరం రోడ్డులో గొటివాడ వద్ద రహదారి పక్కన డంప్ చేసిన వ్యర్థాలు

కానరాని స్వచ్ఛ సంకల్పం

రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన జగనన్న స్వచ్ఛ సంకల్పం పథకం ఎక్కడా కానరాలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని 24 పంచాయతీల్లో 20 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించారు. వీటి నిర్మాణానికి ఒక్కోదానికి రూ.7 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకూ ఖర్చు చేసింది. ఆ సమయంలో అనకపల్లి, నల్లరేగులపాలెం, అమృతపురం, మలునాయుడుపాలెం, ఆరిపాక, బంగారమ్మపాలెం, సబ్బవరం తదితర గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలను అధికారులను అందుబాటులోకి తీసుకొచ్చారు. తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి కంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించారు. ప్రభుత్వం మారిన తరువాత ఆ పథకం నిలిచిపోయింది. అయితే రెండేళ్ల క్రితం ప్రభుత్వం ఈ పథకం జగనన్న స్వచ్ఛ సంకల్పం పేరుతో అమల్లోకి తీసుకొచ్చింది. కానీ అనుకున్న ఫలితాలు రాబట్టలేకపోయారు. ప్రయోగాత్మకంగా బంగారమ్మపాలెంలో చేపట్టారు. కానీ తరువాత ఆ పథకం చతికలబడింది. గ్రామ పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్లకు సరిగ్గా జీతాలు ఇవ్వకపోవడంతో ఈ పథకం అటకెక్కిందని పలు గ్రామాల సర్పంచులు చెబుతున్నారు. మేజరు పంచాయతీ సబ్బవరం, గొటివాడ, బంగారమ్మపాలెం, బోదివలస, వంగలి, మలునాయుడుపాలెం, గుల్లేపల్లి, అసకపల్లి తదితర గ్రామాల్లో వ్యర్థాలను రోడ్ల పక్కన, సాగునీటి చెరువులు/బందలు, కాలువల్లో డంప్ చేస్తున్నారు.

గగ్గోలు పెడుతున్న ప్రజలు

చెత్తా చెదారం ఇష్టానుసారం డంప్ చేస్తుండడంతో స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. దుర్గంధంతోపాటు దోమలు విజృంభించి స్వైరవిహారం చేస్తుండడంతో అనారోగ్యం పాలవుతున్నామని వాపోతున్నారు. పదే పదే ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు చొరవ తీసుకొని చెత్తా చెదారం ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పెదగొల్లలపాలెంలో తుప్పలు బలిసి నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం

ఘనంగా నూకాంబిక అమ్మవారి ఘటాల ఊరేగింపు

» శూలాలు ధరించిన మాలధారణ భక్తులు

» ఆకట్టుకున్న నేలవేషాలు



ఘటాలతో ఊరేగుతున్న మహిళా భక్తులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 5: స్థానిక నూకాంబిక అమ్మవారి ఊరేగింపు శుక్రవారం సాయంత్రం కన్నుల పండువగా సాగింది. నూకాంబిక అమ్మవారి మాలధారణ సంఘం వ్యవస్థాపకులు పొలిమేర శ్రీను ఆధ్వర్యంలో ఊరేగింపు ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మధ్యాహ్నం వేలాది మందికి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపును ఆలయ ఈవో బండారు ప్రసాద్, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాడి జయవీర్ ప్రారంభించారు. ఊరేగింపులో మాలధారణ భక్తులు నోటికి శూలాలు వేసుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. అలాగే మహిళా భక్తులు ఘటాలను తలపై పెట్టుకుని ఊరేగారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు నేల వేషాలు స్థానికులను ఆకట్టుకున్నాయి. నూకాంబిక ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు గవరపాలెం పురవీధుల గుండా సాగింది.

ప్రభుత్వ స్థలాల్లో మళ్లీ ప్రారంభమైన అక్రమ కట్టడాలు

» పట్టించుకోని రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు



దుకాణాల సముదాయ పనులు మళ్లీ ప్రారంభించిన దృశ్యం

అనకాపల్లి, ఏప్రిల్ 5: అనకాపల్లి మండలం మేజర్ పంచాయతీ కొత్తూరులో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు మళ్లీ ఊపందుకున్నాయి. ఎన్నికల పనిలో అధికారులంతా బిజీగా ఉంటారని సెలవు దినాల్లో ఆక్రమణదారులు నిర్మాణాలు చేస్తున్నారు. కొత్తూరు పంచాయతీలో 13వ వీధిని ఆనుకొని ఉన్న రోడ్డులో దుకాణ సముదాయానికి ఒక వ్యక్తి మళ్లీ పనులు చేపట్టాడు. గత ఏడాది నవంబరు 23న పది అడుగుల పొడవు గల గోడలు నిర్మిస్తుండగా అధికారులు వచ్చి అడ్డుకున్నారు. మరలా శుక్రవారం అవే పనులకు శ్రీకారం చుట్టాడు. కాగా ఎర్రచెరువును ఆనుకొని కూడా నిర్మాణాలు జోరుగా చేస్తున్నారు. గత ఏడాది నవంబరు 23వ తేదీన కొందరు కొత్తూరు ఎర్రచెరువు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాన్ని చేస్తుండగా అధికారులు అడ్డుకున్నారు. మరలా ఈ పనులు కూడా ప్రారంభమయ్యాయి. కొత్తూరు పంచాయతీ పరిధిలో స్థలాల ధరలు విపరీతంగా పెరగడంతో ఆక్రమణదారులు బరితెగించి నిర్మాణాలు చేస్తున్నారు. అసలు ఆర్‌అండ్‌బీ అధికారులు కూల్చకుండా ఉండడం వల్లే ఈ విధంగా ఆక్రమణలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూచ ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

పొత్తు గెలవాలి.. పాలన మారాలి

» ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేసిన కూటమి నేతలు

» టీడీపీ కార్యాలయంలో సమావేశమైన అభ్యర్థులు

» విజయానికి సమష్టిగా కృషి చేయాలని నిర్ణయం




సంఘీభావం ప్రకటిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు

విశాఖపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పొత్తు గెలవాలి.. పాలన మారాలి నినాదంతో విశాఖ పార్లమెంట్ స్థానం పరిధిలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ప్రత్యేక మేనిఫెస్టోను విడుదల చేశారు. శుక్రవారం సాయంత్రం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి అభ్యర్థులు, ఆయా పార్టీల ముఖ్యనేతల తో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన మేని ఫెస్టోను విడుదల చేశారు. విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీ భరత్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనలో రాజకీయ నాయకులు ప్రశ్నించే హక్కు కోల్పోయారన్నారు. చంద్ర బాబుకు వస్తున్న ప్రజాదరణను ఓర్వలేకే అక్రమంగా జైలులో పెట్టారన్నారు. లోక్ సభ స్థానంతోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు మంచి మెజారిటీతో విజయం సాధించేలా సమష్టి కృషి చేయాలన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ మాట్లాడుతూ ఉమ్మడి సమావేశంలో ఐదు అంశాలకు సంబంధించి చర్చించామన్నారు. జగన్ అన్యాయంగా, అక్రమంగా దోచుకున్న డబ్బుతో రానున్న ఎన్నికల్లో గెలిచే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాలను తామే ఇస్తున్నామని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. జగన్ చేసిన 12 లక్షల కోట్ల అప్పుల్లో రెండు లక్షల కోట్లు మాత్రమే ప్రజలకు పంచారని, మిగిలిన సొమ్మంతా దోచుకున్నాడన్నారు. అన్న క్యాంటీన్‌లు మూసేశారన్నారు. విశాఖను మత్తు పదార్థాలకు అడ్డాగా మార్చేశారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో అద్భుత విజయాన్ని సాధిస్తామన్నారు. జగన్ నగరంలోని ప్రభుత్వ ఆస్తులను తాకట్టుపెట్టారన్నారు. జనసేన పార్టీ నేత బొలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడాలన్న ఉద్దేశంతోనే కూటమి ఏర్పడిందన్నారు. పింఛన్ల పంపిణీలో వైసీపీ నాటకాలు ఆడుతోందన్నారు. సమావేశంలో తూర్పు, గాజువాక, ఉత్తర, పశ్చిమ, ఎస్.కోట అభ్యర్థులు వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, గణబాబు, కోళ్ల లలిత కుమారి, జనసేన నేతలు బొలిశెట్టి సత్య శివప్రసాద్ రెడ్డి, ఉషాకిరణ్, పాల్గొన్నారు.

వైన్‌షాప్‌లో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

నిందితుడి నుంచి 3,23,000 స్వాధీనం



మిత్తిరెడ్డి శ్రీను

గాజువాక, ఏప్రిల్ 5: శ్రీనగర్ రైల్వే గేటు సమీపంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో గత నెల 18న చోరీకి పాల్పడిన నిందితుడిని గాజువాక పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రైల్వేగేటు సమీప మద్యం దుకాణం సూపర్‌వైజర్ ఎస్.గణేష్ గత నెల 18న విధులకు హాజరయ్యే సమయానికి షాప్ రూఫ్, సీలింగ్ విరగ్గొట్టి ఉండడంతో క్యాష్‌కౌంటర్ తెరిచి చూడగా రూ.5,50,580 నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దుకాణంలో అనకాపల్లి జిల్లా మంత్రిపాలెం ప్రాంతానికి చెందిన మిత్తిరెడ్డి శ్రీను, అలియాస్ దుబాయ్ శ్రీను చోరీకి పాల్పడినట్టు గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారు. నిందితుడి నుంచి రూ.2.85 లక్షలు, రూ.38వేల విలువైన ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు గతంలో దువ్వాడ పరిధిలో చోరీ చేయడంతో పోలీసులు జైలుకు తరలించారు. గత ఏడాది నవంబరులో బయటకు వచ్చి మళ్లీ చోరీకి పాల్పడ్డాడు.

అచ్యుతాపురం సంతలో నాటు కోళ్లకు భలే గిరాకీ

» కొత్తమావాస్య సందర్భంగా అధిక ధరలకు అమ్మకాలు




అచ్యుతాపురం సంతలో విక్రయానికి వచ్చిన నాటుకోళ్లు

అచ్యుతాపురం, ఏప్రిల్ 5: అచ్యుతాపురం, మోసయ్యపేట వారపు సంతల్లో నాటుకోళ్లకు భలే గిరాకీ ఏర్పడింది. అచ్యుతాపురంతో పాటు అచ్యుతాపురం-గాజువాక ప్రధాన రహదారిలో గల ఏపీ బాలికల గురుకుల పాఠశాల వద్ద శుక్రవారం వారపు సంత జరుగుతుంది. గతంలో ఈ రెండు ప్రాంతాలు అచ్యుతాపురంలోనే ఉండేవి. అయితే పంచాయతీలు విభజన తర్వాత గురుకుల బాలికల పాఠశాల వద్ద జరిగే సంత మోసయ్యపేట పంచాయతీ పరిధిలోకి వెళ్లింది. ఈనెల 8న కొత్త అమావాస్య కావడంతో అనకాపల్లి నూకాలమ్మకు ఈ ప్రాంతవాసులంతా మొక్కుబడులకు కోళ్లు కొనుగోలు చేస్తారు. దీంతో ఈ రెండు సంతల్లో నాటు కోళ్లకు గిరాకీ పెరిగింది. శుక్రవారం అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల నుంచి జనాలు వచ్చి భారీగా నాటు కోళ్లు కొనుగోలు చేశారు. సాధారణ రోజుల కంటే శుక్రవారం ఒక కోడిపై రూ.150 నుంచి రూ.200 వరకు అధిక ధరలకు కొనుగోలు చేశారు. సాధారణ రోజులో కేజీ మాంసం పడే కోడి రూ. 450 ఉండగా ఈ వారం సంతలో రూ.600లకు విక్రయించారు. అలాగే రెండు కేజీలు మాంసం పడే కోడి రూ.900 ఉండగా రూ.1,150లకు విక్రయించారు. ధర పెరిగినప్పటికీ నాటు కోళ్లు విపరీతంగా అమ్మకాలు జరిగాయి. దీంతో నాటుకోళ్ల విక్రయదారులు సంతోషంతో ఇళ్లకు వెళ్లారు.

వాహనాల తనిఖీ విస్తృతం చేయాలి

» జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ



జాతీయ రహదారి చెక్‌పోస్టు వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ

సబ్బవరం, ఏప్రిల్ 5 : ఎన్నికల వేళ వాహనాల తనిఖీ విస్తృతం చేయాలని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. జాతీయ రహదారి మర్రిపాలెం టోల్‌గేటు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శుక్రవారం సాయంత్రం ఆయన సందర్శించి వాహనాల తనిఖీని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర పోలీసుల బలగాలు, జిల్లా పోలీసు సిబ్బందికి వాహనాల తనిఖీ, ఎన్నికల నియామవళిపై పలు సూచనలు చేశారు. అనుక్షణం చెక్‌పోస్టు వద్ద అప్రమత్తంగా ఉండాలని, వాహనాల తనిఖీ అధికంగా చేయాలన్నారు. అక్రమ మద్యం, నగదు, ఉచిత తాయిలాల రవాణాను అరికట్టాలని సూచించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

నేటి తరానికి బాబు జగ్జీవన్‌రామ్ ఆదర్శనీయులు

» ఏఎస్పీ విజయ్‌భాస్కర్



జగ్జీవన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 5 : నేటి తరానికి బాబు జగ్జీవన్‌రామ్ ఆదర్శనీయులని ఏఎస్పీ విజయ్‌భాస్కర్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా అన్ రిజర్వ్‌డ్ ప్రత్యేక రైళ్లు

చెన్నై, భువనేశ్వర్ మధ్య ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 5: ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వయా దువ్వాడ మీదుగా ఎర్నాకులం-బ్రహ్మపూర్, చెన్నై ఇగ్మోర్-సంత్రాగచ్చి మీదుగా అన్ రిజర్వ్‌డ్ ప్రత్యేక రైలు, చెన్నై సెంట్రల్-భువనేశ్వర్ మధ్య రిజర్వ్‌డ్ ప్రత్యేక రైలు ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

ఎర్నాకులం-బ్రహ్మపూర్-ఎర్నాకులం అన్ రిజర్వ్‌డ్ రైలు

06087 నంబరు గల రైలు ఈనెల ఆరు నుంచి మే 25వ తేదీ వరకు ప్రతి శనివారం రాత్రి 11.00 గంటలకు ఎర్నాకులంలో బయలుదేరి మర్నాడు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ, మ ర్నాడు ఉదయం 5.00 గంటలకు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరిగి ఈ రైలు ఈనెల ఎనిమిది నుం చి మే 27 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 12.40 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి సాయంత్రం 6.05 దువ్వాడ, మర్నాడు రాత్రి 9.40 గంటలకు ఎర్నాకులం చేరుతుంది.

చెన్నై ఇగ్మోర్-సంత్రాగచ్చి-చెన్నై...

06077 నంబరు గల రైలు ఈనెల 13 నుంచి మే 25 వరకు ప్రతి శనివారం రాత్రి 11.00 గం టలకు చెన్నై ఇగ్మోర్‌లో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 1.54 గంటలకు దువ్వాడ, మర్నాడు (సోమవారం) ఉదయం 7.15 గంటలకు సంత్రాగచ్చి చేరుతుంది. తిరిగి ఈనెల 15 నుంచి మే 27 వరకు ప్రతి సోమవారం ఉదయం 10.00 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి మర్నాడు తెల్లవారుజాము 1.48 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 3.30 గంటలకు చెన్నై ఇగ్మోర్ చేరుతుంది.

చెన్నై సెంట్రల్-భువనేశ్వర్-చెన్నై సెంట్రల్..

06073 నంబరు గల రిజర్వ్‌డ్ ప్రత్యేక రైలు ఈనెల ఆరు నుంచి జూన్ మూడు వరకు ప్రతి సోమవారం రాత్రి 11.45 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 11.15 గంటలకు దువ్వాడ, సాయంత్రం 6.30 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. తిరిగి ఈనెల ఏడు నుంచి జూన్ నాలుగు వరకు ప్రతి మంగళవారం రాత్రి 9.00 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం తెల్లవారుజాము 3.42 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 3.00 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుతుంది.

లాలం భాస్కరరావు మృతి తీరని లోటు

▸ బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

రాంబిల్లి, ఏప్రిల్ 5: టీడీపీ నాయకుడు స్వర్గీయ లాలం భాస్కరరావు మృతి తనకు తీరని లోటు అని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ కన్నీటి పర్యాంతమయ్యారు. శుక్రవారం ఆయన ఉమ్మడి విశాఖ జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ లాలం భవాని, ఆమె కుటుంబ సభ్యులను లాలంకోడూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లాలం భాస్కరరావు చిత్రపటానికి పలువురు నేతలతో కలిసి సీఎం రమేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం రమేశ్ మాట్లాడుతూ స్వర్గీయ భాస్కరరావుతో తనకు ఉన్న స్నేహబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తామిద్దరం కలిసినప్పుడల్లా తన ఇంటికి రమ్మని భాస్కరరావు ఆహ్వానించేవారని, అప్పుడు రాలేకపోయానని, ఇప్పుడు ఇలా వచ్చి ఆయన చిత్రపటానికి నివాళులర్పించడం బాధగా ఉందంటూ రమేశ్ కన్నీటి పర్యాంతమయ్యారు. భాస్కరరావు కుటుంబానికి వెన్నంటూ ఉంటానని హామీ ఇచ్చారు. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ లాలం భవాని మాట్లాడుతూ సీఎం రమేశ్ గెలుపునకు పూర్తిస్థాయిలో సహకరిస్తామన్నారు. ఈ సందర్భంగా సీఎం రమేశ్‌ను లాలం కుటుంబీకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఎం రమేశ్ సోదరుడు సీఎం రాజేష్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు రాజాన రమేష్‌కుమార్, డి.రంగనాయకులు, వి.దిన్‌బాబు, బైలపూడి రామదాసు, పప్పల నూకన్నదొర, జనపరెడ్డి శ్రీనివాసరావు, ఇ. శ్రీరామ్మూర్తి, బీవీఎస్ వర్మ పాల్గొన్నారు.

కూటమి కార్యకర్తలను కాపాడుకుంటా

▸ జనసేన పెందుర్తి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

సబ్బవరం, ఏప్రిల్ 5 : పెందుర్తి నియోజకవర్గంలో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలను కాపాడుకుంటానని జనసేన పెందుర్తి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు భరణికాన బాబూరావు ఇంటి వద్ద శుక్రవారం కూటమి శ్రేణుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసకపల్లి, గాలిభీమవరం, బాటజంగాలపాలెం, నారపాడు, రాయపుర అగ్రహారం టీడీపీ, బీజేపీ, జనసేన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలను పంచకర్ల పరిచయం చేసుకున్నారు. అనంతరం పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ.. ఇప్పటివరకూ మీ గ్రామాల్లో ఎటువంటి ప్రాధాన్యత ఉందో అది కొనసాగిస్తానన్నారు. ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని హామీ ఇచ్చారు. కూటమి నేతలతో చర్చించిన తరువాతే వైసీపీ నుంచి చేరికలు ఉంటాయని, కొంతమంది నోరు మూయించేందుకే నాలుగు రోజులుగా చేరికలను ఆహ్వానించామన్నారు. మాజీమంత్రి బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ విశాఖ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు గండి బాబ్జీ సలహాలతో వారి సారథ్యంలోనే ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ పెందుర్తి పరిశీలకులు శ్రీనివాసులనాయుడు, కూటమి నేతలు ఇందలి వెంకటరమణ, ఎంమహలక్ష్మీనాయుడు, కర్రి కనకరాజు, గొర్లి రామునాయుడు, బీపీ రావు పాల్గొన్నారు.

ఘనంగా వీరాంజనేయస్వామి ఆలయానికి భూమి పూజ


ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి

సబ్బవరం, ఏప్రిల్ 5: మండలంలోని మొగలిపురంలో వీరాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద, అంతకాపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణ మూర్తి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గండి రవికుమార్, ఎడ్ల నాయుడు, మేడపురెడ్డి జగన్నాథం పాల్గొన్నారు.

వృద్ధురాలికి దివ్యాంగుల ఆర్థిక సాయం

అచ్యుతాపురం, ఏప్రిల్ 5: రాంబిల్లి మండలం వాడనర్సాపురానికి చెందిన దౌలిపిల్లి కొండమ్మకు పూడిమడక వివేకానంద దివ్యాంగుల సంఘం సభ్యులు శుక్రవారం ఆర్థిక సాయం చేశారు. ఆమె మేడ మెట్లు పైనుంచి జారి పడి తీవ్రంగా గాయపడింది. ఆమె నడవడానికి వీలుగా వాకర్‌ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మేరుగు నూకరాజు, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లాఅధ్యక్షుడు జి.రాము, సూరాడ ప్రభాకర్, ఎస్.చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో కొనసాగుతున్న చేరికలు

అచ్యుతాపురం, ఏప్రిల్ 5: వైసీపీ నుంచి జనసేనలోకి చేరికలు కొనసాగుతున్నాయి. వైసీపీ మండల అధ్యక్షుడు బైలపూడి శ్రీరామ్‌దాస్ ఆధ్వర్యంలో శుక్రవారం జోగన్నపాలెంకి చెందిన వైసీపీ నాయకులు కర్రి రాజేష్, వాతాడ దుర్గారావు, కె.నగేష్, వి.ప్రవీణ్, లంకాడ దినేష్, జానకిరాం, శీరం పైడిరాజు, తదితరులు జనసేనలో చేరారు. వీరందరికీ జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్ స్థానిక పార్టీ కార్యాలయంలో కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల రాజు, లాలం తాతారావు పాల్గొన్నారు.

పవన్ యాత్రకు రూట్‌మ్యాప్ పరిశీలన

అచ్యుతాపురం, ఏప్రిల్ 5: ఈనెల 8న అచ్యుతాపురంలో జరిగే పవన్ కల్యాణ్ వారాహి యాత్రకు రూట్ మ్యాప్‌ని సీఐ బుచ్చిరాజు శుక్రవారం పరిశీలించారు. యాత్ర సక్రమంగా జరగడానికి సహకరించాలంటూ జనసేన నాయకులు పోలీసులకు అర్జీ పెట్టడంతో సీఐ బుచ్చిరాజు పరిశీలించారు. యాత్రకు భారీ సంఖ్యలో వాహనాలతోపాటు జనాలు తరలి వస్తారని, ట్రాఫిక్‌కి ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని జనసేన నాయకులు కోరారు. వీలైతే యాత్ర సమయానికి వాహనాలను దారి మళ్లించే పరిస్థితులను కూడా పరిశీంచారు. ఆయనతోపాటు ఎస్ఐ నారాయణరావు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కోటవురట్ల, ఏప్రిల్ 5: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అదనపు 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనుల నిమిత్తం ఈనెల 7వ తేదీ ఉదయం 9.30నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నర్సీపట్నం ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణారావు తెలిపారు. ఆదివారంనాడు యండపల్లి, బాపిరాజుకొత్తపల్లి, తంగేడు, రాజుపేట, రామన్నపాలెం, రామచంద్రపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి : సీఐ

నక్కపల్లి, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని స్థానిక సీఐ విజయ్‌కుమార్ కోరారు. శుక్రవారం రాత్రి గొడిచెర్లలో ఎన్నికల కోడ్, సైబర్ నేరాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎవరైనా ఇతరులను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతీ ఒక్కరూ ఎన్నికల కోడ్‌ను పాటించి, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని కోరారు. కొత్తమావాస్య జాతర సందర్భంగాఅశ్లీల, అసాంఘిక చర్యలకు ఎవరైనా పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.

సెగలు కక్కుతున్న సూరీడు

▸ వడగాడ్పులతో ప్రజలు విలవిల

▸ రోజురోజూకు పెరుగుతున్న ఉష్ణోగ్రత


కోటవురట్లలో ఎండ తీవ్రతకు రక్షణగా చున్నీ చుట్టుకున్న యువతులు

కోటవురట్ల, ఏప్రిల్ 5: రోజురోజూకు భానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. సెగలు కక్కుతూ ప్రజలను అల్లాడిస్తున్నాడు. ఒకవైపు ఉక్కపోత, మరోవైపు వడగాడ్పులతో జనం విలవిలలాడుతున్నారు. ఇల్లు వదిలి బయటికి రావాలంటేనే భయతున్నారు. గురువారం ఉదయం 9 గంటల నుంచే సూర్యతాపం మొదలైంది. 11గంటల నుంచి రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరూ రోడ్లపైకి రావడంలేదు. రోజురోజూకి ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతుండడంతో ప్రజలుమరింత భయపడుతున్నారు. గురువారం 39 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల తీవ్రతకు ఇంటిలో ఏ వస్తువు పట్టుకున్న కాలిపోతున్నాయి. సాయంత్రం 5గంటల దాటిన వడగాడ్పులు తగ్గలేదు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు


అనకాపల్లిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కొణతాల, మాజీ ఎమ్మెల్యే పీలా


జగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పిస్తున్న ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్


జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులు అర్పించి మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 5: మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. గవరపాలెం అరుంధతినగర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పలువురు రాజకీయ నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, పట్టణ శాఖ అధ్యక్షుడు నారాయణరావు, ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, పలువురు నాయకులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక చోడవరం బస్టాప్ వద్ద ఎంఆర్‌పీఎస్ నాయకులు మంగరాజు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఆర్.శంకరరావు పూలమాల వేసి నివాళులర్పించారు.

తుమ్మపాలలో.. తుమ్మపాలలో కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఐఆర్ గంగాధర్ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులు అర్పించారు.

పరవాడలో.. స్థానిక ఎస్సీ కాలనీలో శుక్రవారం జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కోటవురట్లలో.. కోటవురట్ల శివారు రాట్నాలపాలెంలో జగ్జీవన్‌రామ్ జన్మదిన వేడుకలను శుక్రవారం టీడీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు.


పాయకరావుపేట రూరల్: జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గెడ్డం బుజ్జి

అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచారు.

సబ్బవరంలో.. మండలంలోని అంతకాపల్లి, అమరపినివానిపాలెంల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఎంఆర్‌పీఎస్ నాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.రామ్మోహన్‌రావు, ఏవో షేక్ బాబూరావు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నక్కపల్లిలో.. మండలంలోని ఉపమాక ఎస్సీ కాలనీలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి టీడీపీ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, ప్రగడ వీరబాబు, కొప్పిశెట్టి హరిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాయకరావుపేటలో.. టీడీపీ పట్టణ కార్యాలయంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి టీడీపీ మండలఅధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, టౌన్ ప్రెసిడెంట్ పెదిరెడ్డి శ్రీను, పార్టీ నాయకులు చింతకాయల రాంబాబు, సుబ్రహ్మణ్యం, పండు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎస్.రాయవరంలో.. మండలంలోని వమ్మవరంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. పెదగుమ్ములూరు జడ్పీ హైస్కూల్‌లో పీఆర్‌టీయూ నాయకులు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకులను ఘనంగా జరిపారు.

ఎలమంచిలిలో.. ఎలమంచిలి తహసీల్దారు కార్యాలయ ఆవరణలో శుక్రవారం జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి డిప్యూటీ కలెక్టరు మనోరమ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు అప్పలరాజు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో.. మండలంలోని గుంటపల్లిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి జనసేన పార్టీ సీనియర్ నాయకులు గెడ్డం బుజ్జి, గెడ్డం ఆకాశ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాలాభిషేకం చేశారు. అదేవిధంగా గోపాలపట్నం, సత్యవరం, అరట్లకోట, పెదరాంభద్రపురం తదితర గ్రామాలలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.


ఎస్.రాయవరం: వమ్మవరంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సత్యనారాయణ తదితరులు


కోటవురట్లలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో టీడీపీ నాయకులు


సబ్బవరం: అంతకాపల్లిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంఆర్‌పీఎస్ నేతలు

అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తా : కొణతాల


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ

కొత్తూరు, ఏప్రిల్ 5: పట్టణంలోని దిబ్బవీధి సీతారామ దేవస్థానం కొబ్బరి తోటలో శుక్రవారం కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాత 18, 19, 27 వార్డులకు చెందిన నాయకులు, కార్యకర్తలతో స్థానిక సమస్యలపై మాట్లాడారు. జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ.. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సమస్యలన్నింటినీ పరిష్కరించే దిశగా ముందుకు వెళతామని హామీ ఇచ్చారు. కొబ్బరి తోటలో కల్యాణ మండపం, జగన్నాథస్వామి దేవాలయాలను పునర్నిర్మాణం చేస్తామని చెప్పారు. ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ తనయుడు రిత్విక్ మాట్లాడుతూ ఈ ప్రాంతం అభివృద్ధికి పరిశ్రమలు ఏర్పాటు చేసి, స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నాయకులు డాక్టర్ కేకేవీఏ.నారాయణరావు, సూరే సతీష్, జనసేన పార్టీ నాయకులు విల్లూరి హరికృష్ణ, మళ్ల శ్రీను, దూలం గోపి, బీజేపీ నాయకులు కొణతాల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ హెచ్చరికతో రాజానపాలెంలో పెన్షన్ల పంపిణీ

అచ్యుతాపురం, ఏప్రిల్ 5: మండలంలోని రాజానపాలెంలో అధికారులు పెన్షన్లను పంపిణీ చేశారు. తంతడి పంచాయతీలో 270 మంది పింఛనుదారులు ఉన్నారు. వీరిలో రాజానపాలెం పంచాయతీ పరిధిలో 144 మంది ఉన్నారు. గురువారం ఉదయం నుంచి గ్రామంలో కల్యాణ మండపం వద్ద పింఛనుదారులు అధికారుల రాక కోసం వేచి ఉన్నారు. ఈ సమయంలో సర్పంచ్ ఉమాదేవి అధికారులకు ఫోన్ చేస్తే తంతడి వెళ్లి తీసుకోవాలని చెప్పడంతో ఆమె మండిపడ్డారు. వెంటనే మండలంలో విలేకర్లను పిలిపించి పింఛన్ల పంపిణీ అధికారుల తీరును ఎండగట్టారు. అంతేకాకుండా ఎమ్మెల్యే కన్నబాబురాజు ఆదేశంతోనే అధికారులు పింఛన్ల పంపిణీ మార్చారని ఆరోపించారు. అధికారులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా కనీసం జవాబు కూడా ఇవ్వలేదని ఆమె ఆరోపించారు. శుక్రవారం గ్రామంలో పింఛన్లను పంపిణీ చేయకుంటే భారీ ఎత్తున ఆందోళన చేస్తామని సర్పంచ్ ఉమాదేవి హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు గురువారం పొద్దుపోయిన తర్వాత రాజానపాలెంలో పింఛన్లను పంపిణీ చేశారని రాజానపాలెం సర్పంచ్ ఉమాదేవి తెలిపారు. అలాగే శుక్రవారం ఉదయం అధికారులు గ్రామానికి వచ్చి పెన్షన్‌లు పంపిణీ చేశారని ఆమె తెలిపారు.

90 శాతం పింఛన్ల పంపిణీ : ఎంపీడీవో

మండలంలో సామాజిక పింఛన్లు 90 శాతం పంపిణీ చేశామని ఎంపీడీవో సురేష్ కుమార్ తెలిపారు. అయితే అభయహస్తం పింఛన్లకు నగదు రానందున పంపిణీ చేయలేదన్నారు. మండలంలో 600 మంది అభయహస్తం పింఛన్‌దారులు ఉన్నారన్నారు. రాజానపాలెంలో పింఛన్లను పూర్తిగా పంపిణీ చేశామన్నారు.

అంగన్‌వాడీల ఆశలు వమ్ము

... 5వ పేజీ తరువాయి

నెలకు రూ.10,500, ఆయాకు రూ.6,000 వేతనంగా చెల్లించే వారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఒకసారి వేయి చొప్పున వేతనాన్ని పెంచారు. అయితే, తెలంగాణ ప్రభుత్వం కూడా పీఆర్‌సీని అమలు చేయ డంతో అక్కడి సిబ్బందికి వేతనాలు పెరిగాయి. ప్రస్తుతం తెలంగాణలో అంగన్‌వాడీ కార్యకర్తకు రూ.13,500, ఆయాకు రూ.9 వేలు చొప్పున చెల్లిస్తు న్నారు. కానీ, ఇక్కడ జగన్ ప్రభుత్వం కార్యకర్తకు రూ.11,500, ఆయాకు రూ.7,000 మాత్రమే ఇస్తోంది. గతంలో ఇచ్చిన హామీ మేరకు వేయి చొప్పున అదనపు వేతనం ఇవ్వాలంటే కార్యకర్తకు రూ.14,500, ఆయాకు రూ.10 వేలు చెల్లించాలి. కానీ, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు.

ఇతర సమస్యలు పట్టని వైనం

ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను కూడా పరిష్కరిస్తానని జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి ఉన్నారు. రిటైర్‌మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, పని భారాన్ని తగ్గించాలని అంగన్‌వాడీ సిబ్బంది కోరుతున్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత వాటిలో ఒక్కటి కూడా నెరవేర్చకపోవడంతో గత ఏడాది డిసెంబరు నుంచి సుమారు 42 రోజులపాటు నిరవధిక సమ్మె చేశారు. ఎన్నికల ముందు అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న సమ్మెతో ఇబ్బంది కలుగుతోందని భావించిన ప్రభుత్వం..సంఘ నాయకులతో చర్చలు జరిపింది. ఈ డిమాండ్లను అమలు చేయడానికి అంగీకరించింది. అయితే, వీటిలో రిటైర్‌మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచుతూ మాత్రమే జీవో విడుదల చేసింది. మిగిలిన డిమాండ్లకు సంబంధించి జీవోలను విడుదల చేయలేదు. అలాగే సమ్మె కాలానికి సంబంధించిన పూర్తి వేతనాన్ని చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ఆ వేతనాన్ని కూడా ఇప్పటివరకూ విడుదల చేయలేదు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటుచేస్తామని చెప్పారు. ఇప్పటికీ కమిటీని ఏర్పాటు చేయలేదని, తమను నమ్మించి ఈ ప్రభుత్వం మోసం చేసిందంటూ అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షురాలు మణి ఆరోపించారు. అంగన్‌వాడీలను జగన్ మోసం చేశారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేకపోయారని అనకాపల్లి ప్రాంతంలో పని చేస్తున్న ఒక అంగన్‌వాడీ కార్యకర్త ఆవేదన వ్యక్తంచేశారు. సమ్మె సమయంలో అన్నింటినీ పరిష్కరిస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దలు...ఒక్క డిమాండ్‌ను మాత్రమే నెరవేర్చే దిశగా చర్యలు తీసుకున్నారని విశాఖ నగర పరిధిలో పనిచేస్తున్న మరో అంగన్‌వాడీ ఉద్యోగి వాపోయారు. ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే రోజు దగ్గర్లో ఉందని ఆమె ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

... 5వ పేజీ తరువాయి

ఆమోదించామని చెప్పారు.

రోలుగుంట మండలంలో..

రోలుగుంట: మండలంలోని శరభవరం గ్రామ సచివాలయ పరిధిలోని శరభవరం, అర్ల గ్రామ వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. శరభరం, అర్ల పంచాయతీలకు చెందిన 18 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో జాన్‌లింకన్‌కు అందజేశారు. అంతకు ముందు ఉదయం ఆయా గ్రామ కార్యదర్శులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఈఆర్డీవో నూకరాజు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపమాక, నక్కపల్లిల్లో అనిత ప్రచారం


ఉపమాకలో పర్యటిస్తున్న అనిత

నక్కపల్లి, ఏప్రిల్ 5: మండలంలోని ఉపమాక, నక్కపల్లిలో టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపమాకలో అనితకు టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. తొలుత మెరకవీధి రామాలయాన్ని అనిత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీ రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడనున్నారన్నారు. అంతకు ముందు నక్కపల్లిలో టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ ఆధ్వర్యంలో అనిత ఇంటింటా ప్రచారం సాగించారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు కొప్పిశెట్టి కొండబాబు, కొప్పిశెట్టి బుజ్జి, ప్రగడ వీరబాబు, లాలం కాశీనాయుడు, అబద్ధం, దేవర సత్యనారాయణ, కురందాసు నూకరాజు,వైబోయిన రమణ, తదితరులు పాల్గొన్నారు.

వారాహి యాత్రను విజయవంతం చేయండి

▸ సుందరపు విజయకుమార్, ప్రగడ నాగేశ్వరరావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సుందరపు, ప్రగడ

రాంబిల్లి, ఏప్రిల్ 5 : అచ్యుతాపురంలో ఈనెల 8వ తేదీన జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ చేపట్టబోయే వారాహి యాత్రను విజయవంతం చేయాలని జనసేన ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం లాలంకోడూరులోని నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. వారాహి యాత్ర తొలుత ఈనెల 6వ తేదీన జరగాల్సి ఉన్నప్పటికీ పవన్‌కల్యాణ్‌కు జ్వరం కారణంగా ఈనెల 8వ తేదీకి వాయిదా పడిందన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ లాలం భవాని, సీఎం రాజేష్, జనసేన నాయకులు బైలపూడి శ్రీరామదాసు, పప్పల నూకన్నదొర, జనపరెడ్డి శ్రీనివాసరావు,టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమాంబ ఆలయ ప్రారంభం

పరవాడ, ఏప్రిల్ 5 : మండలంలోని వెన్నెలపాలెంలో నూతనంగా నిర్మించిన దుర్గమాంబ ఆలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మీశ్రీనివాస్ దంపతులతోపాటు సర్పంచ్ వెన్నెల అప్పారావు అమ్మవారికి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధనను ఏర్పాటు చేశారు.

బీజేపీ అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలి : సీపీఎం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 5 : ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ చోడవరంలో అధికారులపై బీజేపీ నేత దౌర్జన్యానికి పాల్పడ్డారన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

పాయకరావుపేట, ఏప్రిల్ 5: స్థానిక ఆరో వార్డులో శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర, బీజేపీ నాయకుడు కువల కుమార్‌తోపాటు టీడీపీ నాయకులు చింతకాయల రాంబాబు, మలిపెద్ది వెంకటరమణ, సూరా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎన్నికల అధికారులతో ఆర్ఓ సమీక్ష

ఎలమంచిలి, ఏప్రిల్ 5: ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా అధికారులంతా పక్కాగా విధులు నిర్వహించాలని ఎలమంచిలి రిటర్నింగ్ అధికారి మనోరమ అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు, బీఈఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ గురించి అధికారులకు వివరించారు.

'కూటమి అభ్యర్థుల విజయమే అందరి లక్ష్యం'

ఎలమంచిలి, ఏప్రిల్ 5: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జనసేన పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో మునిసిపాలిటీలో మూడు పార్టీల నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో నానాజీ మాట్లాడారు. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్, జనసేన ఎలమంచిలి అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్‌ల విజయానికి ఐక్యతతో సాగుదామన్నారు. అనంతరం జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, బీజేపీ నేత నక్కా శివశంకర్ పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ వాహనాలకు బ్రేక్



ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన బోర్డు

ఎలమంచిలి, ఏప్రిల్ 5 : పట్టణంలోకి భారీ వాహనాలకు అనుమతి లేదని, అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. నూతనంగా నిర్మించిన బ్రిడ్జి వద్ద, పట్టణంలోని బైపాస్ జంక్షన్ పెట్రోల్ బంకు జంక్షన్ వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ హెచ్చరికలను పట్టించుకోని భారీ వాహనదారులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

అడ్డరోడ్డులో వైసీపీ కార్యాలయం ప్రారంభం

ఎస్.రాయవరం, ఏప్రిల్ 5: మండలంలోని అడ్డరోడ్డులో వైసీపీ మండల నూతన కార్యాలయాన్ని శుక్రవారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు సమక్షంలో కొరుప్రోలు గ్రామానికి చెందిన పలువురు వైసీపీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోనలోవలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, వైసీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, బొలిశెట్టి శారదాకుమారి పాల్గొన్నారు.


వైసీపీ నేత డీఎస్ఎన్ రాజును కలిసిన సుందరపు

రాంబిల్లి, ఏప్రిల్ 5 : రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల్లో వైసీపీ నేత డీఎస్ఎన్ రాజు(బుజ్జి)ను శుక్రవారం కూర్మనపాలెంలోని ఆయన నివాసంలో జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీలోకి రావాలని డీఎస్ఎన్ రాజును కోరారు. రాజు మాట్లాడుతూ రెండు,మూడు రోజులు జనసేన పార్టీలో చేరుతున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో పలువురు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కొత్త అమావాస్య జాతర

▸ గరగల ఊరేగింపుతో శ్రీకారం ▸ ఎటుచూసినా కోలాహల వాతావరణం


నాతవరంలో గరగలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


జిల్లేడిపూడిలో కొలువైన నూకాంబిక

నాతవరం, ఏప్రిల్ 5 : కొత్త అమావాస్య జాతర ఉత్సవాలు మండలంలోని పలు గ్రామాల్లో ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా గురువారం రాత్రి నుంచి కోలాహలం నెలకొంది. గరగల ఊరేగింపుతో శ్రీకారం చుట్టారు. నాతవరంలో తొలుత గరగలకు పూజారి ఇంటివద్ద పూజలు జరిపి గ్రామంలో ఊరేగిస్తూ నూకాంబికా ఆలయం వద్దకు తీసుకు వెళ్లారు. అలాగే జిల్లేడిపూడి (బుచ్చింపేట)లో నూకాంబిక ఆలయం వద్ద అమ్మవారి జతర ఏడో తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుద్దీపాలతో అలంకరణ చేపడుతున్నారు. ఈ మూడు రోజులు ప్రత్యేక పూజలు జరపనున్నారు. జిల్లేడిపూడి ఆలయానికి కొత్త అమావాస్యను పురస్కరించుకుని ఇటు అనకాపల్లి, అటు కాకినాడ జిల్లాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రానున్నారు. కొందరు ఇక్కడే వంటలు వండుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించిన అనంతరం సహపంక్తి భోజనాలు చేస్తుంటారు.


జిల్లేడిపూడిలో విద్యుద్దీపాలంకరణలో నూకాంబిక ఆలయం

గురందొరపాలెంలో పోలీసులు కార్డెన్ సెర్చ్

▸ వేకువజాము ఐదు గంటలకు పెద్ద సంఖ్యలో గ్రామానికి చేరిక

▸ ప్రతి ఇల్లు క్షుణ్ణంగా పరిశీలన

▸ రికార్డులు లేని 25 బైక్‌లు, బొలేరో వాహనం స్వాధీనం


గురందొరపాలెం శివారులో బెల్లం ఊటను తీయిస్తున్న పోలీసు అధికారులు

నర్సీపట్నం అర్బన్ , ఏప్రిల్ 5 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని గురందొరపాలెంలో శుక్రవారం పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము ఐదు గంటలకు నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్ పర్యవేక్షణలో ఎనిమిది మంది సీఐలు, పన్నెండు మంది ఎస్ఐలు, 120 మంది పోలీస్ సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. అప్పటి నుంచి గ్రామంలోని వారిని బయటకు వెళ్లనీయకుండా, బయటివారు లోపలకు రాకుండా చర్యలు చేపట్టారు. గ్రామంలోని ఇళ్లలోనూ, ఖాళీ స్థలాల్లోనూ, పశువుల శాలల వద్ద తనిఖీలు నిర్వహించారు. అలాగే, వాహనాలను తనిఖీ చేశారు. వాటికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. సరైన రికార్డులు లేని 25 ద్విచక్ర వాహనాలు, ఒక బొలేరో వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఒక వ్యక్తి నుంచి పదిలీటర్ల సారా, మూడువందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అనంతరం ఏర్పాటైన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో గంజాయి, నాటుసారాను కట్టడి చేసేందుకు ఈ దాడులు చేసినట్టు చెప్పారు. గతంలో గంజాయి రవాణా కేసుల్లో పట్టుబడ్డ వ్యక్తుల ఇళ్లలో డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు జరిపామన్నారు. రూరల్ సీఐ బి.హరి, ఎస్ఐ భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

... 5వ పేజీ తరువాయి

ఆమోదించామని చెప్పారు.

రోలుగుంట మండలంలో..

రోలుగుంట: మండలంలోని శరభవరం గ్రామ సచివాలయ పరిధిలోని శరభవరం, అర్ల గ్రామ వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. శరభరం, అర్ల పంచాయతీలకు చెందిన 18 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో జాన్‌లింకన్‌కు అందజేశారు. అంతకు ముందు ఉదయం ఆయా గ్రామ కార్యదర్శులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఈఆర్డీవో నూకరాజు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆశలు వమ్ము

... 5వ పేజీ తరువాయి

నెలకు రూ.10,500, ఆయాకు రూ.6,000 వేతనంగా చెల్లించే వారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఒకసారి వేయి చొప్పున వేతనాన్ని పెంచారు. అయితే, తెలంగాణ ప్రభుత్వం కూడా పీఆర్‌సీని అమలు చేయ డంతో అక్కడి సిబ్బందికి వేతనాలు పెరిగాయి. ప్రస్తుతం తెలంగాణలో అంగన్‌వాడీ కార్యకర్తకు రూ.13,500, ఆయాకు రూ.9 వేలు చొప్పున చెల్లిస్తు న్నారు. కానీ, ఇక్కడ జగన్ ప్రభుత్వం కార్యకర్తకు రూ.11,500, ఆయాకు రూ.7,000 మాత్రమే ఇస్తోంది. గతంలో ఇచ్చిన హామీ మేరకు వేయి చొప్పున అదనపు వేతనం ఇవ్వాలంటే కార్యకర్తకు రూ.14,500, ఆయాకు రూ.10 వేలు చెల్లించాలి. కానీ, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు.

ఇతర సమస్యలు పట్టని వైనం

ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను కూడా పరిష్కరిస్తానని జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి ఉన్నారు. రిటైర్‌మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, పని భారాన్ని తగ్గించాలని అంగన్‌వాడీ సిబ్బంది కోరుతున్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత వాటిలో ఒక్కటి కూడా నెరవేర్చకపోవడంతో గత ఏడాది డిసెంబరు నుంచి సుమారు 42 రోజులపాటు నిరవధిక సమ్మె చేశారు. ఎన్నికల ముందు అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న సమ్మెతో ఇబ్బంది కలుగుతోందని భావించిన ప్రభుత్వం...సంఘ నాయకులతో చర్చలు జరిపింది. ఈ డిమాండ్లను అమలు చేయడానికి అంగీకరించింది. అయితే, వీటిలో రిటైర్‌మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచుతూ మాత్రమే జీవో విడుదల చేసింది. మిగిలిన డిమాండ్లకు సంబంధించి జీవోలను విడుదల చేయలేదు. అలాగే సమ్మె కాలానికి సంబంధించిన పూర్తి వేతనాన్ని చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ఆ వేతనాన్ని కూడా ఇప్పటివరకూ విడుదల చేయలేదు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటుచేస్తామని చెప్పారు. ఇప్పటికీ కమిటీని ఏర్పాటు చేయలేదని, తమను నమ్మించి ఈ ప్రభుత్వం మోసం చేసిందంటూ అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షురాలు మణి ఆరోపించారు. అంగన్‌వాడీలను జగన్ మోసం చేశారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేకపోయారని అనకాపల్లి ప్రాంతంలో పని చేస్తున్న ఒక అంగన్‌వాడీ కార్యకర్త ఆవేదన వ్యక్తంచేశారు. సమ్మె సమయంలో అన్నింటినీ పరిష్కరిస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దలు...ఒక్క డిమాండ్‌ను మాత్రమే నెరవేర్చే దిశగా చర్యలు తీసుకున్నారని విశాఖ నగర పరిధిలో పనిచేస్తున్న మరో అంగన్‌వాడీ ఉద్యోగి వాపోయారు. ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే రోజు దగ్గర్లో ఉందని ఆమె ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు.

బోర్లు ఇలా.. గొంతులు తడిసేది ఎలా..?


ప్రస్తుతం గ్రామంలోని పలుచోట్ల చేతిబోర్ల దుస్థితి

▸ రామన్నపాలెంలో తాగునీటి కష్టాలు

▸ బోర్లు పాడైనా పట్టించుకోని అధికారులు

▸ అవస్థలు పడుతున్న గ్రామస్థులు


నిరుపయోగంగా ఉన్న వీధికుళాయి



మాకవరపాలెం, ఏప్రిల్ 5 : మండలంలోని రామన్నపాలెం పంచాయతీలో పలుచోట్ల తాగునీటి బోర్లు మూలకు చేరాయి. కొన్నిచోట్ల తుప్పల మధ్య దర్శనమిస్తున్నాయి. అయినప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారు. వేసవి దృష్ట్యా క్రాష్ ప్రోగ్రామ్ ద్వారా ఇటువంటి వాటిపై దృష్టిసారిస్తామని అధికారులు చెప్పినా ఇక్కడ మాత్రం కార్యరూపం దాల్చలేదు. ఇదిలా వుంటే, గ్రామంలోని ఏకావారి వీధిలో సుమారు నెల రోజుల నుంచి తాగునీటి కష్టాలు మరీ తీవ్రంగా ఉన్నాయి. కుళాయిల నుంచి నీరు రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ పైపులైన్లు పాడైనా కన్నెత్తి చూసేవారు కరువయ్యారని మహిళలు వాపోతున్నారు. అసలే ఎండలు ముదురుతున్న తరుణంలో ఉన్నతాధికారులు తమ గ్రామంలో నీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా అక్కడి వారంతా కోరుతున్నారు.

నేడు బలిఘట్టంలో 'మహిళా మేలుకో'

▸ టీడీపీ ఆధ్వర్యంలో వేలాది మందితో నిర్వహణకు ఏర్పాట్లు

▸ మహిళల సమస్యలే ప్రధాన అజెండా : విజయవంతానికి పులుపు



మహిళా మేలుకో పోస్టర్ విడుదల చేస్తున్న పద్మావతి, రమణమ్మ తదితరులు

నర్సీపట్నం, ఏప్రిల్ 5 : ఇక్కడి బలిఘట్టం బీసీ కాలనీలో భారీ ఎత్తున మహిళా మేలుకో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం నాలుగు గంటలకు బలిఘట్టం బీసీ కాలనీలో జరిగే ఈ కార్యక్రమానికి వేలాది మంది మహిళలు హాజరు కానున్నట్టు చెప్పారు. మహిళలపై లైంగిక దాడులు, హత్యలు పెరిగి పోయాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రెండేళ్ల క్రితం ఎస్సీ కాలనీలో చిన్నారిపై లైంగిక దాడి జరిగిందని గుర్తు చేశారు. దిశ చట్టం ఏమై పోయిందని ప్రశ్నించారు. జడ్పీటీసీ సుకల రమణమ్మ, కౌన్సిలర్ చింతకాయల పద్మావతి మాట్లాడుతూ మహిళల సమస్యలే ప్రధాన అజెండాగా చేపట్టిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మహిళలు తరలి రావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చింతకాయల సువర్ణ, చింతకాయల దివ్య, కౌన్సిలర్ పెదిరెడ్ల దివ్య, పైల కాశీరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గణేశ్‌కు నోటీసు జారీ

నర్సీపట్నం, ఏప్రిల్ 5 : పట్టణంలోని వెంకునాయుడుపేటలో వైసీపీ నేత ఇంట్లో వలంటీర్లతో సమావేశం నిర్వహించిన ఘటనలో రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాం స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్‌కు నోటీసు జారీ చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా మంగళవారం సాయంత్రం వెంకునాయుడుపేటలో అనుమతి తీసుకోకుండా వలంటీర్లతో సమావేశం నిర్వహించారని, ఎమ్మెల్యే గణేశ్‌పై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేను వివరణ కోరుతూ రిటర్నింగ్ అధికారి నోటీసు జారీ చేశారు.

చింతకాయల విజయ్ పై కేసు నమోదు

నర్సీపట్నం : ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతి తీసుకోకుండా నాతవరం శివారు కోటమ్మతల్లి గుడి వద్ద కార్యకర్తలతో సమావేశం నిర్వహించినందుకు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, మరో నలుగురిపై కేసు నమోదు చేశామని శుక్రవారం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి జయరాం తెలిపారు.

చీడికాడలో నూకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ


అమ్మవారిని దర్శించుకొంటున్న గవిరెడ్డి తదితరులు

చీడికాడ, ఏప్రిల్ 5 : మండల కేంద్రం చీడికాడలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం నూకాలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దోకలవారి కుటుంబ ఇలవేల్పుగా ఉన్న ఈ అమ్మవారికి తొలుత పురోహితులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మాడుగుల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనూరాధలు వేర్వేరుగా దర్శించుకొన్నారు. వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

93 శాతం పెన్షన్లు పంపిణీ

మాకవరపాలెం, ఏప్రిల్ 5 : మండలంలో 93శాతం పెన్షన్లను పంపిణీ చేసినట్టు ఎంపీడీవో చంద్రరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాకవరపాలెం సచివాలయంలో పెన్షన్ల పంపిణీ తీరును పరిశీలించారు. అభయ హస్తం ద్వారా పెన్షన్లు పొందేవారికి నగదు అందించడం ప్రారంభించామన్నారు. శనివారం నాటిని వందశాతం పంపిణీ పూర్తి చేస్తామని వివరించారు.

ఆ దాడులతో సంబంధం లేదు : విప్ ధర్మశ్రీ

చోడవరం, ఏప్రిల్ 5 : టైల్స్ వ్యాపారిపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారుల దాడికి సంబంధించి తనపై తప్పుడు ఆరోపణలు చేసిన అనకాపల్లి ఎంపీ అభ్యర్థి, టైల్స్ దుకాణం యజమానులపై పరువునష్టం దావా వేస్తున్నట్టు విప్ ధర్మశ్రీ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టైల్స్ వ్యాపారి దుకాణంపై అధికారుల దాడితో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. అయినప్పటికీ రాజకీయ రంగు పులిమి, ఈ విధంగా తనపై తప్పుడు ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. ఈ విలేకరుల సమావేశంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ గెలిస్తేనే గ్రామాల ప్రగతి

▸ చోడవరం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు వెల్లడి

▸ వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరిక


కొత్తకోటలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో కేఎస్ఎన్ఎస్ రాజు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 5 : రాష్ట్రంలో టీడీపీ పగ్గాలు చేపడితేనే గ్రామ సాధికారత సాధ్యపడుతుందని మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. మండలంలోని లింగభూపాలపుర అగ్రహారం పంచాయతీ వార్డు మెంబరు ముత్యాల త్రివేణి తన అనుయాయులు 30 మందితో వైసీపీని వీడి శుక్రవారం టీడీపీలో చేరారు. వీరికి కండువాలు పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కడికి వెళ్లినా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయన్నారు. వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తమరాన దాసు, దొండా శ్రీను, యల్లపు జగ్గారావు, సాయం శేష తదితరులు పాల్గొన్నారు.

రావికమతం : మేజర్ పంచాయతీ కొత్తకోటలో శుక్రవారం ఇరవై కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు ఆయన గ్రామంలోని దుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజాన కొండ నాయుడు, కోట నీలవేణి, కోట గోవిందరావు, సత్యనారాయణ, ఉగ్గిన శ్రీనివాసరావు, వెల్లంకి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రాభివృద్ధిని కాంక్షించేది కూటమి పార్టీలే'


చౌడువాడ సభలో మాట్లాడుతున్న ఉమ్మడి అభ్యర్థి పైలా ప్రసాదరావు

కె.కోటపాడు, ఏప్రిల్ 5 : రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడినట్టు మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు తెలిపారు. మండలంలోని చౌడువాడలో శుక్రవారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టనున్న పథకాలను వివరించారు. అనంతరం వైసీపీ పాలనలో వైఫల్యాలను ఎండగట్టారు. బీసీలకు టీడీపీతోనే సామాజిక న్యాయం సాధ్యమన్నారు. కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సోదరుడు సురేశ్‌నాయుడు, టీడీపీ, జనసేన, బీజేపీల నాయకులు రొంగలి మహేష్, రాయపురెడ్డి కృష్ణ, కొటాన ఈశ్వరరావు, కన్నూరు సూర్యనారాయణ, లెక్కల మల్లేశ్వరరావు, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, మొల్లి గోవింద తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల : టీడీపీ అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టనున్న సూపర్ సిక్స్ పథకాలపై పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని టీడీపీ మాడుగుల అధ్యక్షుడు అద్దెపల్లి జగ్గారావు కోరారు. జమ్మాదేవిపేట, సత్యవరం. డి.గొటివాడ గ్రామాల్లో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. నాయకులు ఉండూరు దేముడు, పుప్పాల రమేశ్, వడ్డి రాజ్‌కుమార్, సూర్యనారాయణ, గట్రెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'మాడుగుల టీడీపీ టికెట్టు గవిరెడ్డికి ఇవ్వాలి'


ర్యాలీలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

చీడికాడ, ఏప్రిల్ 5 : మాడుగుల అసెంబ్లీ టికెట్ విషయమై టీడీపీ అధిష్టానం పునరాలోచించి, గవిరెడ్డి రామానాయుడుకు ఇవ్వాలని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బాది తాతారావు, ఎంపీటీసీలు పైల ముత్యాలనాయుడు, వీశ్ల కోటేశ్వరరావు, గాడి ప్రసాద్, సర్పంచ్ కొల్లి సూరినాయుడు తదితరులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఇక్కడి శివాలయం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డికి టికెట్ ఇస్తే గెలిపించుకుని చంద్రబాబుకు బహుమతిగా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి


తెనుగుపూడిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద గురుకుల పాఠశాల సిబ్బంది నివాళి


నర్సీపట్నంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద ఆర్డీవో జయరాం అంజలి


చోడవరం మండలం లక్కవరంలో జగజ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళి

నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 5 : ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆర్డీవో జయరాం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జయరాం మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. నర్సీపట్నం తహసీల్దార్ శ్రీరాములు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాతవరం : సమసమాజ స్థాపనకు మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు మరవలేనివని మాజీ ఎంపీపీ ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. నాతవరంలో జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, సర్పంచ్ గొలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, చెక్కా జోగిరాజు, మాజీ ఎంపీటీసీ బంగారు సూరిబాబు పాల్గొన్నారు.

గొలుగొండ : జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా పలు గ్రామాల్లో ఆయనకు నివాళులర్పించారు. ఏఎల్‌పురంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి, మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ భాస్కరరావు, డీటీ, రెవెన్యూ సిబ్బంది నివాళులర్పించారు.

మాకవరపాలెం : జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా మాకవరపాలెం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి తహసీల్దార్ మురళీమోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కొండలఅగ్రహారం, గిడుతూరు గ్రామాల్లో జగ్జీవన్‌రామ్‌కు అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డీటీ శంకరరావు, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరం : మండలంలోని లక్కవరంలో అరుంధతి సేవా సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోర్తా శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కండెల్లి వెంకటరావు, ఎర్రవరపు పైడిరాజు, నాగప్పారావు, లింగాలు తదితరులు పాల్గొన్నారు.

రావికమతం : జగ్జీవన్‌రామ్ జయంతిని మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక అరుంధతి సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మంజేటి రాజుమాదిగ, రాముమాదిగ, పరుశురామ్, అప్పారావు, ఎత్తుల రాజుబాబు, పలువురుమహిళలు పాల్గొన్నారు.

రోలుగుంట : మండలంలోని కొమరవోలు, రోలుగుంటలలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీటీసీ గొర్లె వెంకటరామన్, పులగుజ్జు వెంకట లక్ష్మి, రమణ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ విశేష కృషి చేశారని పలువురు కొనియాడారు. తెనుగుపూడి అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో జగ్జీవన్‌రామ్‌కు ఉపాధ్యాయులు నాగరాజు, నాగేశ్వరరావు, ధనుంజయ్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఉల్లి శ్రీను తదితరులు నివాళులర్పించారు.

చీడికాడ : జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ ఎం.కామేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'పీఎం గ్రామ సడక్ యోజన'తో చురుగ్గా రోడ్డు నిర్మాణం


బీటీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

మాడుగుల, ఏప్రిల్ 5 : మండల కేంద్రం మాడుగులలో ఏళ్లకాలంగా బీటీరోడ్డు నిర్మాణం, తాచేరుపై వంతెన నిర్మాణ లేకపోవడంతో అటుగా రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. దీంతో మాడుగుల నుంచి సాగరం డి.గొటివాడ వరకూ ఎట్టకేలకు భారత నిర్మాణ ప్రధానమంత్రి గ్రామ సడక్‌యోజన పథకం కింద నిధులు మంజూరయ్యాయి. ఫలితంగా మాడుగుల నుంచి సాగరం, పాడేరు రోడ్డు, డి.గొటివాడ వరకూ బీటీ రోడ్డుతో పాటు తాచేరు కాలువపై వంతెన నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. వర్షాకాలంలో తాచేరు కాలువ నీటి ప్రవాహం దాటలేని పరిస్థితుల్లో తాచేరు మధ్యలో ఉన్న పంప్‌హౌస్ నుంచి కర్రల వంతెన నిర్మించి అటుగా రాకపోకలు సాగించేవారు. రోడ్డు, వంతెన నిర్మాణం జోరుగా సాగుతుండడంపై ఈ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.